# దళిత రత్న గ్రహీతలకు
# ఓయూలో నీరాజనం









**హైదరాబాద్/మే 2(జర్నలిస్ట్ వార్త);** సామాజిక విప్లవాలకు నిలయమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణం శనివారం నీలి సైన్యపు నినాదాలతో హోరెత్తింది. అణగారిన వర్గాల గొంతుకలుగా మారి, సామాజిక పోరాటాల్లో విశేష కృషి చేసినందుకు గాను దళిత రత్న పురస్కారాలు అందుకున్న బిర్రు మహేందర్ మాదిగ, కందికట్ల విజయ్ మాదిగలకు ఓయూ గడ్డపై ఘన సన్మానం జరిగింది. ఎమ్మెస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎఫ్ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చాయి. బాణసంచా కాల్చి, గజమాలలు వేసి, శాలువాలతో పురస్కార గ్రహీతలను ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ మాట్లాడుతూ, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సారథ్యంలో ముప్పై ఏళ్ల పాటు సాగిన ఎస్సీ వర్గీకరణ ఉద్యమం ఒక సామాజిక విప్లవమని అభివర్ణించారు. ఆ ఉద్యమ సెగల్లో రాటుదేలి, దళిత సమాజం కోసం నిరంతరం పనిచేస్తున్న మహేందర్, విజయ్‌లకు ఈ అవార్డులు రావడం గర్వకారణమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల రక్షణ కోసం ప్రాణాలకు తెగించి పోరాడే కార్యకర్తలకు సమాజం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ పురస్కారాలే నిదర్శనమని పేర్కొన్నారు.

బడుగుల గొంతుకగా నిలవాలి

ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు బంజూరి విజయ్ మాదిగ మాట్లాడుతూ, మందకృష్ణ మాదిగ ఆశయ సాధనే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యతను అలవర్చుకుని, అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం పాటుపడాలని సూచించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారపు శ్రీనివాస్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్ మాదిగలు మాట్లాడుతూ, ఈ గౌరవం పురస్కార గ్రహీతలపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సామాజిక చైతన్యం కోసం నిరంతరం పరితపించే నాయకులకు ఈ అవార్డులు స్ఫూర్తినిస్తాయని వెల్లడించారు. సన్మాన గ్రహీతలు బిర్రు మహేందర్, కందికట్ల విజయ్ మాట్లాడుతూ తమను గుర్తించి గౌరవించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అణగారిన వర్గాల గొంతుకగా నిలబడేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధమని ప్రకటించారు. పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ సారథ్యంలో తమ కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి మాదిగ, ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా సీనియర్ నాయకులు గోలి సుధాకర్ మాదిగ, మాదిగ జర్నలిస్ట్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు బిర్రు కరుణాకర్ మాదిగ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, పరిశోధక విద్యార్థులు మరియు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. .















